సిలికానాంధ్ర

తెలుగు సాహితీ సాంస్కృతిక సంప్రదాయ స్ఫూర్తి

సుజనరంజని

శ్రీ ప్లవ నామ సంవత్సర

ఉగాది ఉత్సవం

ప్రత్యేక సంచిక

పద్యం - హృద్యం

sujanaranjani.siliconandhra.org

సిలికానాంధ్ర

మనబడి

(అమెరికాలో ACS-WASC గుర్తింపు పొందిన ఏకైక తెలుగు విద్యాలయం)

ACCREDITED — WESTERN ASSOCIATION OF SCHOOLS AND COLLEGES

మీ పిల్లలను 2021-22 తరగతులలో చేర్పించండి

14+ సం||లు

65,000+ విద్యార్థులు

10+ దేశాలు

250+ ప్రాంతాలు

30+ రాష్ట్రాలు

2,000+ భాషా సేవకులు

తెలుగు చదవడం, వ్రాయడం మాట్లాడడం నేర్చుకోండి

తరగతుల నమోదు ప్రారంభమైనది	
1 ప్రవేశం	4 ప్రమోదం
2 ప్రసూనం	5 ప్రభాసం
3 ప్రకాశం	బాలబడి*

*బాలబడి తరగతికి అడ్మిషన్లు అమెరికా మరియు కెనడా లలో సంవత్సరం పొడవునా ఉంటాయి!

క్రొత్త విద్యార్థులు	
4 - 6 సం||	బాలబడి
6+ సం||	ప్రవేశం

గుర్తింపు

- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గుర్తింపు
- అమెరికాలోని వివిధ స్కూల్ డిస్ట్రిక్ట్‌లలో ప్రపంచభాషగా (World Language Credit) గుర్తింపు
- ప్రఖ్యాత WASC సంస్థచే గుర్తింపు

పరీక్షలు

- ప్రకాశం, ప్రభాసం విద్యార్థులకు తెలుగు విశ్వవిద్యాలయం పరీక్షలు
- సుశిక్షితులైన ఉపాధ్యాయులచే శిక్షణ

కార్యక్రమాలు

- పిల్లల పండుగ, తెలుగు మాట్లాట, బాలానందం, తెలుగుకుపరుగు, బాలరంజని (మొబైల్ యాప్), పలుకుబడి, పద్యనాటకం, నాటకోత్సవం మరియు బాలచంద్రిక, పిల్లల పోటీలు - పద్యపఠనం, కథాస్రవంతి, పరభాష లేకుండా పలుకు, మరియు వ్యాసరచన.

సెప్టెంబర్ 11, 2021 నుండి తరగతులు ప్రారంభం

మనబడిలో చేర్పిద్దాం - తెలుగు భాష నేర్పిద్దాం

For more details and to register:

manabadi.siliconandhra.org

info@manabadi.siliconandhra.org

1-844-626-BADI (2234)

Follow us on :

సిలికానాంధ్ర

తెలుగు సాహితీ సాంస్కృతిక సంప్రదాయ స్ఫూర్తి

సుజనరంజని

శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది ప్రత్యేక సంచిక

పద్యం – హృద్యం

సంపాదకుడు: పుల్లెల శ్యాంసుందర్

ముఖచిత్రం: వెంకట్ మాకిన

సుజనరంజని అంతర్జాల మాసపత్రిక సంపాదకవర్గం

తాటిపాముల మృత్యుంజయుడు

తమిరిశ జానకి, శైలజా మిత్ర, డా. భీంపల్లి శ్రీకాంత్

సాంస్కృతిక కార్యదర్శి: తనుగుల ప్రియ

సుజననీయం

తెలుగు సాహితీ సంప్రదాయ స్ఫూర్తికి మారుపేరైన సిలికానాంధ్రా ప్రతి ఉగాదికి 'సుజనరంజని' మాసపత్రికను ప్రత్యేక సంచికగా ఒక పుస్తక రూపంలో వెలువరించడం ఆనవాయితీ. కానీ కరోనా మహమ్మారి గత సంవత్సరమునుండీ మనజీవితాలలో చాలా మార్పులు తీసుకు రావడం మూలంగా ప్రతి సంవత్సరము అందరము కలసి సరదాగా చాలా కోలాహలముతో జరుపుకునే సిలికానాంధ్ర ఉగాది ఉత్సవమును కూడా తతిమ్మా పనుల లాగే ఈ యేడు అంతర్జాలములో జరుపుకుంటూ, ఈసారి ఉగాది ప్రత్యేక సంచికను ఒక e-book రూపములో ప్రచురిస్తున్నాము. అయితే ఈ కరోనా వల్ల జరిగిన ఒక అతిచిన్న మేలేమిటంటే, జీవితంలో వేగం కొద్దిగా తగ్గి అందరూ ఒకసారి వెనకకు చూసుకుని యిప్పటివరకు మనము ఏమిచేసామనే సింహావలోకనం చేసుకునే అవకాశం దొరికింది. అది అప్పుడప్పుడూ అవసరం కూడా. అదే పంథాలో ఈ ప్లవనామ సంవత్సర ఉగాది ప్రత్యేకసంచికలో గత 14 సంవత్సరాలుగా సుజనరంజని 'పద్యం-హృద్యం' శీర్షికలో యిచ్చిన కొన్ని మంచి సమస్యలను పరికించి, వాటికి పాఠకులనుండి అందిన మంచి పూరణలను పొందిపరచి మీముందుకు తీసుకు వచ్చాము. ఈ ప్రత్యేక సంచికకు సంపాదకునిగా ఉండే అవకాశము కలగటము నా అదృష్టము.

సాంప్రదాయ పద్యసాహిత్యానికి ఎప్పుడూ పెద్దపీట వేసే సిలికానాంధ్ర, సుజనరంజని పత్రిక ప్రారంభింపబడిన కొద్దిరోజులకే 'పద్యం-హృద్యం' శీర్షికను ప్రవేశపెట్టడం జరిగింది. పద్యంలో ఉన్న అందాన్ని, గొప్పతనాన్ని పదిమందికీ అందించి, వారిని యీ ప్రక్రియకు దగ్గిర చేసి, పద్యానికుండవల్సిన మర్యాదని గుర్తుచేయాలనేది యీ శీర్షిక ముఖ్యసంకల్పం. పద్యం-హృద్యం శీర్షికలో భాగముగా ప్రతి మాసము ఒక సమస్య యిచ్చి పాఠకులనుండి అందిన పూరణలను తరువాతి మాసంలో ప్రచురించి ప్రోత్సహిస్తున్నాము. ఇచ్చిన ప్రశ్నలలో సింహభాగం సమస్యా పూరణములు. దాని ముఖ్యోద్దేశము ఒక అనర్థవంతమైన వాక్యాన్ని యిచ్చి దానిని వాడుతూ ఒక అర్థవంతమైన పద్యాన్ని వ్రాయమని కవిని సవాలు చేయడం. ఈ శీర్షికలో అప్పుడప్పుడే

పద్యాలు వ్రాయడం మొదలు పెట్టిన ఔత్సాహిక కవుల నుండి కొమ్ములు తిరిగిన అవధానుల వరకు చాలామంది పాల్గొనడం మా అదృష్టము.

ఆవకాయ, ఉలవచారు లాగా అవధానం కూడ మన తెలుగు వారి సొత్తు అనేది నిర్వివాదాంశం. అవధానమునకు తలమానికము సమస్యాపూరణ. ఈ సంచికలో సమస్య పూరణల గురించి చాలా విలువైన సమాచారం ఉంది. సమస్యలను చాలా విధములుగా పూరించవచ్చు. సమస్యకు ముందు కొన్ని అక్షరాలు జోడించి అర్ధవంతంగా పూరించవచ్చు. అలాగే, సమస్యను రెండు భాగాలుగా విరిచి అర్ధవంతం చెయ్యవచ్చు. కొన్ని సమస్యలను ప్రశ్నార్థకాలుగా మార్చి పూరించవచ్చు. అప్పుడప్పుడూ పద్యములో కొన్ని ప్రశ్నలనడిగి వాటికి వరుస సమాధానములుగా సమస్యను విరిచి క్రమాలంకారములో పూరించ వచ్చు. ఇంచుమించుగా ఒక ఏభయ్యి పైచిలుకు సమస్యలు, వాటి విభిన్నమైన పూరణలు యిక్కడ పొందుపరిచాము గాబట్టి, సరదాగా చదువుకొనడానికే కాకుండా, రానున్న కాలంలో ఎవరైనా సమస్యా పూరణల గురించి అధ్యయనం చేయదలచుకుంటే ఈ సంచిక ఒక ప్రమాణసూచికగా పనికివస్తుందనే చిన్న ఆశ కూడా ఉంది. అంతేకాకుండా ఈ సంచికను ఒక కథలాగా లేదా నవలలాగా కాకుండా ఏ పుటకు ఆ పుటను చదువుకోవచ్చు గాబట్టి, దీనిని ఎవరైనా ప్రింటు చేసుకుంటే అది ఒక కాఫీ టేబుల్ పుస్తకముగా కూడా మనగలదు.

స్థలాభావము వలన ప్రతి సమస్యకు అందిన పూరణలలో ఒక మూడు పూరణలు మాత్రమే ఎంపిక చేసి ఈ సంచికలో ప్రచురించడం జరిగింది. సమస్యను పూరించడానికి చాలా పద్ధతులు ఉన్నాయి కాబట్టి వచ్చిన పూరణలలో యివి మంచివి అని ఎంచడము చాలా కష్టము. ఎంపికలో ఒకేరకమైన పూరణలు ఉంటే, పూరణ విశిష్టతకన్నా వైవిధ్యానికి కొద్దిగా ప్రాధాన్యత ఎక్కువ యివ్వడము జరిగింది. పూరణల రచయితలు సహృదయంతో అర్థము చేసుకుంటారని ఆశిస్తున్నాను.

పద్యమంటే చాలా మక్కువగల నాకు గత తొమ్మిది సంవత్సరాలుగా సుజనరంజని పత్రికలో ఈ పద్యం-హృద్యం శీర్షిక నిర్వహించే అవకాశం కలగటం నా పూర్వజన్మ సుకృతం. ప్రతినెలా విడవక పద్యం-హృద్యం శీర్షికలో పాల్గొంటూ పూరణలు పంపుతున్న కవులందరకూ పేరుపేరునా కృతజ్ఞతలు. పాఠకులందరకు ఈ ప్రత్యేకసంచిక నచ్చుతుందని ఆశిస్తూ..

భవదీయుడు,

పుల్లెల శ్యామసుందర్

వాక్సీనులు వాడకున్న వైరస్ దొలగుస్

ఎం.వి.యస్.రంగనాథం, హైదరాబాద్

కం.

దీక్షగ డెబ్బది శాతము
వాక్సినువాడు జనులుండ, వగవగ నేలా!
ఆక్షేపణగా నితరులు
వాక్సీనులు వాడకున్న, వైరస్ దొలగున్!

తల్లాప్రగడ రామచంద్ర రావు, శాన్ హొసే, కాలిఫోర్నియా

కం.

ఋక్సంహితపారాయణ
వాక్శుద్ధియడరి, మనోజవమ్ముగ యా, వి
ష్వక్సేనుని దయ కలుగగ,
వాక్సీనులు వాడకున్న వైరస్ దొలగున్!

మద్దాలి స్వాతి, రెడ్వుడ్ సిటీ, కాలిఫోర్నియా

కం.

ఏక్షణ మెటులుండునొకో
వాక్సీనులు వాడకున్న? వైరస్ దొలగున్
లక్షణముగ సూచించిన
వాక్సీనులు వాడి జనులు స్వస్థత పొందన్.

శివరాత్రిన నిదురబోవ చింతలు దీరుస్

నేదునూరి . రాజేశ్వరి, న్యూజెర్సీ

కం.

దేవికి ప్రియమట పూజలు
నవరాత్రులు విభవ మొంద నవదుర్గలుగా
శివునికి నీటను ముంచిన
శివరాత్రిన నిదురఁ బోవ చింతలు దీరున్!

సూర్యకుమారి వారణాశి, నార్త్ కరోలినా

కం.

భవసాగర మీదంగను
శివనామస్మరణ జేయు చింతన జేయన్
అవరోధ మగుతరి మనకు
శివరాత్రిన నిదుర; వోవ చింతలు దీరున్!

దువ్వూరి వి యస్ సుబ్బారావు, కొంతమూరు, రాజమహేంద్రవరం.

కం.

పవలెల్లను శ్రమ పడితివి
యెవరా చరవాణి మాట లీనిశి వేళన్
చివరకు చెడునారోగ్యము
శివ!, రాత్రిన నిదురవోవ చింతలు దీరున్!

చోరులు మంచివారనుట చోద్యము కాదది యెంచి చూడగన్

టేకుమళ్ళ వెంకటప్పయ్య, విజయవాడ

ఉ.

దారుణ రీతిలో ధనము దాచెడి దొంగల కొల్లగొట్టుచున్
భారపు కాలమున్ మిగుల బాధల దొర్లెడి బీదవారికిన్
తీరుగ పంచిపెట్టుచును తియ్యని రోజుల వేచిచూడ, నా
చోరులు మంచి వారనుట చోద్యము కాదది ఎంచి చూడగన్

కంది శంకరయ్య, వరంగల్

ఉ.

మారుని పుష్పబాణముల మానసమందున నాటజేసి, ము
ద్దారెడి హావభావము లుదారముగా గురిపించి, ప్రేమక
ళ్హార సుగంధముల్ గురిసి హాయి నొసంగెడు ముద్దరాండ్రు హృ
చ్చోరులు మంచివా రనుట చోద్యము కాదది యెంచి చూడఁగన్!

మాజేటి సుమలత, క్యూపర్టీనో, కాలిఫోర్నియా

ఉ.

మారుని గన్నదండ్రి బలుమాయల జేయుచు బొంచి జూచుచున్
చీరల దొంగిలించి, మయి చింతల దీర్చగ గోప భామినుల్
కూరిమి గూడగం జెలగి గ్రుమ్మరుచో యటు రాస కేళిలోన్
"చోరులు మంచి వారనుట చోద్యము కాదది ఎంచి చూడగన్!"

పోట్లాటల వలనఁ గలుగు భువిన సుఖంబుల్

డా. రామినేని రంగారావు యం.బి.బి.యస్,పామూరు,ప్రకాశం జిల్లా,

కం.

మాట్లాడెడు కళలబ్బిన

కొట్లాటలు సమసిపోవు, కూరిమి కలుగున్

కాట్లాట లుడుగు; మానిన

పోట్లాటల వలనఁ, గలుగు భువిన సుఖంబుల్!

యం.వి.సి.రావు, బెంగళూరు

కం.

కొట్లాడగ నసుర సురలు

పాట్లన్నియు దీర్ప దక్కె, పద్మయు, శశియు

న్నిట్లెరుగ తెల్ల మగుగా

పోట్లాటల వలన కలుగు భువిన సుఖంబుల్

పుల్లెల శ్యామసుందర్, సాన్ హోసే, కాలిఫోర్నియా

(శ్రీమతి రాజ తల్లాప్రగడ గారి భావనకు పద్య రూపము)

కం.

కోట్లాది భక్తులకు అగ

చాట్లను నారదుడు తీర్ప చక్కగ జగతిన్

కొట్లాటలు సల్పగ యా

పోట్లాటల వలనఁ గలుగు భువిన సుఖంబుల్

గోటితో సరిపోవుదానికి దానికి గొడ్డలేటికి వద్దురా!

<u>గుండు మధుసూదన్, వరంగల్లు</u>

మ.కో.

మాటతో సరిపోవుదానికి, మంత్రమేటికి? వద్దురా!
పాటతో సరిపోవుదానికి, పద్యమేటికి? వద్దురా!
చేటితో సరిపోవుదానికి, శ్రేష్ఠ యేటికి? వద్దురా!
గోటితో సరిపోవుదానికి, గొడ్డలేటికి? వద్దురా!

<u>చావలి విజయ, సిడ్నీ</u>

మ.కో.

మాటకే సరిపెట్టకో వొకమారు పెంచెడు కయ్యముల్
దీటుగా పరికించ మేధతొ తీరు కష్ట సమస్యలున్
గోటితో సరిపోవుదానికి గొడ్డలేటికి వద్దురా!
సాటి పోలికలా స్ఫురించెగ సామెతే సరి చూడగన్.

<u>పుల్లెల శ్యామసుందర్, శాన్ హోసే, కాలిఫోర్నియా</u>

మ.కో.

పూటుగాతిన పొట్టలోపల పోటులొచ్చెనొ, చెప్పరా
నోటనల్లపు ముక్కనుంచిన నొప్పితగ్గును, ట్రిక్కురా
మాటిమాటికి ఇంగిలీషువి మందులెందుకు, ఖర్చురా
గోటితో సరిపోవుదానికి దానికి గొడ్డలేటికి? వద్దురా!

సతిని విడచు వాడె సజ్జనుండు

రావు తల్లాప్రగడ, శేన్ హోసె, కాలిఫోర్నియా

ఆ.వె.

లంచమన్నదేమి మంచిది కాదయా
ముష్టియెత్తుకున్న ముట్టుధనము!
మంచిదారిపట్టు మనిషియై యట్టి వ
సతిని విడుచు వాడె సజ్జనుండు!

డా. రామినేని రంగారావు యం.బి.బి.యస్, పామూరు, ప్రకాశం జిల్లా

ఆ.వె.

ఇంటి బాధ్యతలను ఇంపుగా నెరవేర్చి
ఇంద్రియముల సుఖము నీసడించి
సన్యసింపనెంచి సర్వసమ్మతముగా
సతిని విడుచు వాడె సజ్జనుండు

సుమలత మాజేటి, క్యూపర్టినో, కాలిఫోర్నియా

ఆ.వె.

నీతి గాను ధర్మ నిరతి కలిగి ఏక
పత్ని నిష్ఠ పరగు పరమపురుషు
డతివ దేవలోక లలితాంగైనను పర
సతిని విడుచు, వాడె సజ్జనుండు!

న్యస్తాక్షరి: 'తొలకరి' మీద ఒక ఉత్పలమాల వ్రాయవలెను. (1) ఒక పాదము యొక్క రెండవ అక్షరం 'త' (2) ఇంకొక పాదము యొక్క పదవ అక్షరం 'స' (3) ఇంకొక పాదము యొక్క పదకొండవ అక్షరం 'ద' (4) ఇంకొక పాదము యొక్క పదహారవ అక్షరం 'చ'

డా. చింతలపాటి మురళీ కృష్ణ , బ్రిస్బేన్ సిటీ

ఉ.

ఆతప వహ్నికీలల ప్రహారముచే నిలువెల్ల నెండి ధా
త్రీ తలమెల్ల దాహపరితృప్తికి నోళుల చాచి యార్తితో
చేతన నిచ్చు వర్షకణసిద్ధిని గోరెడివేళ మేఘ సం
ఘాతము తొల్కరించి రస కందళితమ్ముగ నించె వర్షమున్

వి.ఆర్. గణపతి, కరీంనగర్

ఉ.

నూతుల వట్టి పోయినవి, నోళ్ళు తడారెను, చుక్క నీరు లే
దీ తొలి వర్షపుం జినుక దేదిక దిక్కది యేదటంచునున్
చేతల నుడ్గి మానవులు క్షీణ మనస్కులరైరి, కృంగె నీ
క్ష్మాతల మందు జీవనము సల్పెడు ప్రాణులు వృక్ష సంతతుల్ !

శివప్రసాద్ చావలి,సిడ్నీ

ఉ.

ఆతురతన్ నెమళ్ళు తమ యందము పింఛములిప్పి చూపగన్
చాతకముల్ సకాములుగ సంచరణంబొనరింప; గ్రీష్మ సం
జాత ముఖాగ్నిదగ్ధ పలు జంగలముల్ ననుచున్నెలర్పగన్
యా తొలి జల్లులన్ జిలుకు యందము తొల్కరి చందమౌ నిలన్

(సకాములు: తృప్తులు; ముఖాగ్ని: కార్చిచ్చు; జంగలము: అరణ్యము; ననుచు: చిగుర్చు; ఎలర్చు: అతిశయించు)

తల్లి పెనుదయ్య మగుచుండు తనయు లకును

వారణాసి సూర్యకుమారి, మచిలీ పట్నం

తే.గీ.

పాలుత్రాగు ప్రాయము నుండి ప్రాణప్రదము
తల్లి! తనమంచి కోరు ప్రత్యక్షదైవ
మంచు భావించుచు నభిమానించ నెట్లు
తల్లి పెనుదయ్య మగుచుండు తనయులకును?

డా. రామినేని రంగారావు యం.బి.బి.యస్,పామూరు,ప్రకాశం జిల్లా

తే.గీ.

స్వార్జితంబైన తమతండ్రి సంపదెల్ల
గుప్పిటను బట్టి కూతురు-కొడుకులనక
అనవరతమును వేధించు నామె, మారు
తల్లి-పెనుదయ్య మగుచుండుతనయులకును.

పుల్లెల శ్యామసుందర్, శాన్ హోసె, కాలిఫోర్నియా

తే.గీ.

తనయులకు తెలియ జేయక తండ్రి యొకడు
అప్పులను చేసి బ్రతికెను గొప్పగాను
తండ్రి అప్పు తీర్చుడనుచు తరుము 'పైడి
తల్లి' పెనుదయ్యమగుచుండు తనయులకును

విద్యను వలదన్నవాడె విజ్ఞుండిలలో

వారణాసి సూర్యకుమారి, మచిలీ పట్నం

కం.

ఉద్యమములను విజేతలు
విద్యావంతుల ప్రతిభయె విశ్వవిపంచిన్
హృద్యముగ మ్రోగు కనుక న
విద్యను వలదన్న వాడె విజ్ఞుం డిలలో!

డా. రామినేని రంగారావు యం.బి.బి.యస్,పాముూరు,ప్రకాశం జిల్లా

కం.

ఆద్యుం డణువిచ్ఛిత్తికి
సద్యోగము మరచి బాంబు సఫలత కూర్చే
విద్యను గరపెదనన - ఆ
విద్యను వలదన్న వాడెవిజ్ఞుం డిలలో

సమవర్తి సుబ్రమణ్య శర్మ, హైదరాబాదు

కం.

హృద్యార్ద్ర మార్గ దూరం
బుద్యోగదమయ్యు మూలముల బెకలించున్
అద్యతన పశ్చిమాశా
విద్యను వలదన్నవాడె విజ్ఞుండిలలో

చైనాలో తెలుగుఁ నేర్చి చక్కగ బ్రదికెన్

శివప్రసాద్ చావలి, సిడ్నీ

కం.

చైనాకేగి వరించిన

ఈనాటి తెలుంగు ఐ.టి. యింతియె కోరన్

నానా పాట్లన్ వరుడును

చైనాలో తెలుగు నేర్చి చక్కగ బ్రతికెన్

పుల్లెల శ్యామసుందర్, శేన్ హోసే, కాలిఫోర్నియా

కం.

నానా భాషల కథలను

చైనాలో ప్రజలు కూడ చదివవి మెచ్చన్

తానొక అనువాదకుడై

చైనాలో తెలుగు నేర్చి చక్కగ బ్రదికెన్

అయినాపురపు శ్రీనివాసరావు, సెయింట్ లూయిస్, మిస్సోరి

కం.

జానుగ తెలుగునుఁ జదివిన

కానగును వివేకమంచు ఘనులే దెలుపన్

చీనీ దేశపు లిన్ హాంగ్

చైనాలో తెలుగు నేర్చి చక్కగ బ్రదికెన్

వరదలు మేలుమేలనుచు పాడుచునాడిరి కేరళీయులే!!

గండికోట విశ్వనాధం, హైదరాబాదు

చ.

కురిసెను వాన వెల్లువలు కుండలవోతగ రాష్ట్ర మంతటన్,
విరిగెను వృక్షరాజములు, వీధులునిండ్లు మునింగె నీట, వే
తెరగుల కష్టనష్టములు తీరినవేళ స్వయంకృషోన్నతిన్
వరదలు మేలుమేలనుచు పాడుచునాడిరి కేరళీయులే.

మైలవరపు సాయికృష్ణ, సాక్రమెంటొ, కాలిఫోర్నియా

చ.

వరదుడనంత పద్ముడు కృపాలు డమోఘ సునీల సుందరాం
గు రిపువినాశకారుడు ప్రకోపనియంత విశేష శ్రీనిధీ
వరుడు కృపాసముద్రుని ప్రభావముచేత విహారభూతులా
వరదలు మేలుమేలనుచు పాడుచు నాడిరి కేరళీయులే
విహారభూతి = విహారయాత్రికుల (వరదలు)

సూర్యకుమారి వారణాసి, మచిలీపట్నం

చ.

వరుసఁగ నొందె కష్టములు వారలి ఘోర తుఫాను బాధితుల్
బరువగుచుండ జీవనము భాగ్యవశమ్ము పరోపకారులై
కరుణను సల్పినట్టి సహకారము నార్థిక రూపమైన యా
వరదలు మేలుమేలనుచు పాడుచు నాడిరి కేరళీయులే

నాస్తికులకు దైవమన్న నయమున్ భయమున్

<u>సూర్యకుమారి వారణాశి, నార్త్ కరోలినా</u>

కం.

ఆస్తికులమంచు కొందరు

జాస్తిగ తమ దొంగభక్తి చాటుచు నుండన్

వాస్తవముగ నుండునె యా

నాస్తికులకు దైవమన్న నయమున్ భయమున్?

<u>గాదిరాజు మధుసూదన రాజు, అనంతపురం</u>

కం.

ప్రస్తుతము దూరదర్శని

యాస్తికతత్త్వంబు బెంచె నవలోకింపన్

వాస్తవమెటుకై కలుగును

నాస్తికులకు దైవమన్న నయమున్ భయమున్

<u>శ్రీనివాసరావు అయినాపురపు.</u>

కం.

జాస్తిగ మనమున గొలిచెడి

ఆస్తికులకు దైవమన్న ఆదరణెపుడున్

నాస్తి యనుచు కూడ వెరచు

నాస్తికులకు దైవమన్న నయమున్ భయమున్!

బాంబుల వలనే దేశము బాగుపడును

సహస్రకవిరత్న, సహస్రకవిభూషణ, శ్రీమతి జి. సందిత, బెంగుళూరు

తే.గీ.

నాశమయ్యె హిరోషిమ నాగసాకి
మానవ వినాశనంబయ్యె మనసు చెదరె
బాంబులవలనే! దేశముబాగుపడును
మరువ నణ్వస్త్రనిర్మితిన్ మనుజ లెల్ల

సూర్యకుమారి వారణాసి (రాంచి)

తే.గీ.

దేశప్రగతికై తపనయే దేశభక్తి
పాలకుల్ సలుపు న్యాయపాలనమున
సంఘసంస్కరణను జేయ చట్టములను
బాంబుల వలననే దేశము బాగుపడును

శివప్రసాద్ చావలి, సిడ్నీ

తే.గీ.

హద్దుమీరు పటాసులు హాని చేయు
స్వస్థతకు! దీపావళి సంబరాన
ఉత్త కాకరవత్తులు ఉల్లిగడ్డ
బాంబుల వలనే దేశము బాగుపడును

తలనొప్పిని దగ్గుమందు తగ్గించు నిలన్

డా. రామినేని రంగారావు యం.బి.బి.యస్,పామూరు,ప్రకాశం జిల్లా

కం.

జలుబును దగ్గును కూడిన
తలభారము తీవ్రమైన తత్కాలములో
మెలకువ దగ్గుకు మందిడ
తలనొప్పిని దగ్గుమందు తగ్గించు నిలన్

ఇంద్రగంటి సతీష్ కుమార్, చెన్నై

కం.

తలగల వానిని వదలి సిరి
గల వానిని జేరె వైద్య కళ, వ్రాసెడి మం
దుల పనితీరును జూడగ
తలనొప్పిని దగ్గు మందు తగ్గించు నిలన్!

పుల్లెల శ్యామసుందర్, శాన్ హోసే, కాలిఫోర్నియా

కం.

తలనొప్పికి వైద్యుడొక్కడు
ఫలితముకై నిత్యరోగి కిచ్చె బెనడ్రిల్
బలమగు నమ్మకముండిన
తలనొప్పిని దగ్గుమందు తగ్గించునిలన్

(నిత్యరోగి = హైపోకాండ్రియాక్; హైపోకాండ్రియాక్ లకు ఏ మందు ఇచ్చినా వైద్యుడు మందిచ్చాడన్న నమ్మకముతో తాత్కాలికముగా తగ్గుతుందంటారు)

గుమ్మడి పెద్ద దైన మరి కోసెడి కత్తికి లోకువే కదా!

జంధ్యాల కుసుమకుమారి, హైదరాబాదు

ఉ.

నెమ్మది నుండనీక మది నేమర జేయగ జూతురన్నిటన్
ఇమ్ముగ వర్ణనాంశముల నిత్తురు దత్తపదమ్ము లిచ్ఛమై
సమ్ముఖమందు పృచ్ఛకులు సందడిగా యవధాన వేత్తకున్
గుమ్మడి పెద్దదైన మరి కోసెడి కత్తికి లోకువే కదా!

డా. రామినేని రంగారావు యం.బి.బి.యస్, పామూరు,ప్రకాశం జిల్లా

ఉ.

ఇమ్ముగ నుద్ధరింతురని ఎంతయొ నాశతో ఎన్నుకోవగన్
మమ్మును దేశసంపదను మార్మికరీతుల దోచ, వారిపై
ఉమ్మిరి, తుచ్ఛపాలకులనూడ్చిరి ఓటున ఎట్టకేలకున్
గుమ్మడి పెద్దదైన మరి కోసెడి కత్తికి లోకువేగదా!

గండికోట విశ్వనాధం, హైదరాబాద్

ఉ.

నెమ్మిని భీకరాటవుల నిర్భయ వీరవిహారకేళి ద
ర్పమ్మున తిర్గు దంతి, జనరంజక క్రీడల నాడు చోట సా
మమ్మున లొంగి వంగి చను మావటి అంకుశ పోటు ధాటికిన్
గుమ్మడి పెద్దదైన మరి కోసెడి కత్తికి లోకువే గదా!

ప్రియుడా రమ్మనెను తల్లి ప్రేమగ తనయున్

యడవల్లి ఆదినారాయణ శాస్త్రి, సికందరాబాదు

కం.

జయవత్సర కవివరుగా

జయమును సాధింపగ విని చాల ముదమునన్

జయమగుత, 'కావ్యరచనా

ప్రియుడా', రమ్మనెను తల్లి ప్రేమగ తనయున్

వారణాసి సూర్యకుమారి ,మచిలీపట్టణం

కం.

ప్రియమైన పిండివంటలు

నయమగు పద్ధతిని వండినానుర నీకై

ప్రియమారతినగ "భోజన

ప్రియుడా" రమ్మనెను తల్లి ప్రేమగ తనయున్

జంధ్యాల కుసుమకుమారి, హైదరాబాదు

కం.

ప్రియమారగ నవనీతము

నయగారము మీర చేకొన త్వరిత గతిన్

క్రియగొను మోహన మురళీ

ప్రియుడా! రమ్మనెను తల్లి ప్రేమగ తనయున్

ఉప్పును కప్పురంబు మరి ఉండవె చూడగ నొక్క పోలికన్!

<u>ఇంద్రగంటి సతీష్ కుమార్, చెన్నై</u>

ఉ.

అప్పుడు యుండె, ఉప్పు మరి కప్పుర ముద్దలొకే విధంబునన్!
చెప్పిన వేమసూక్తమును చెల్లును. కాలము మార్పు చెందగన్,
ఉప్పును కప్పురంబులకు రూపము లిపుడు మారె మెండుగన్!
ఉప్పును కప్పురంబు మరి ఉండవె చూడగ నొక్క పోలికన్!

<u>డా.రామినేని రంగారావు యం.బి.బి.యస్, పామూరు,ప్రకాశం జిల్లా.</u>

ఉ.

ఇప్పుడు సర్వసంపదల నింపుగ దోచెడు నాయకాధముల్
మెప్పును పొందగోరి తమ మేనికి ఖద్దరుగుడ్డ కట్టుచున్
చెప్పెద రెన్నొ త్యాగములు చేసిన పెద్దల పార్టి మాదనిన్
ఉప్పును కప్పురంబు మరి ఉండవె చూడగ నొక్కపోలికన్

<u>యం.వి.సి.రావు, బెంగళూరు</u>

ఉ.

తప్పులు సేయుచున్ నొరుల తప్పుల నెంచెడు నీచ మానవుల్
మెప్పుల కోసమై తగని మిక్కుట వేషము లేయుచుండ పై
కప్పును జూడగా జనుల కైతవ నైజము లెన్న సాధ్యమే
ఉప్పును కప్పురంబు మరి ఉండవె చూడగ నొక్కపోలికన్!

మతమును వీడిన మనుజుడె మాన్యుండిలలో!

మాజేటి సుమలత, క్యూపర్టీనో

కం.

మతముల చెప్పిన హితవుల
మతలబు మరచుచు, సతతము తనదగు మతమే
మతమని వాదించెడి అభి
మతమును వీడిన మనుజుడె మాన్యుండిలలో

పుల్లెల శ్యామసుందర్, శాన్ హోసే

కం.

మితిమీరి సురను త్రాగుట,
అతిగా తా చీట్లపేక ఆడుట, రెండున్,
సతతము గొను దుర్జన స
మ్మతమును - వీడిన మనుజుడె మాన్యుండిలలో

వేదుల బాలకృష్ణ మూర్తి, శ్రీకాకుళం

కం.

మతమనగ అభిప్రాయము
ఇతరుల మతములన భేధమెంచక స
మ్మతముగ మెలగుచు ఛాందస
మతమును వీడిన మనుజుడె మాన్యుండిలలో

తాతకు దగ్గులు గరపక తప్పదు బాలా!

జగన్నాథ రావ్ కె. ఎల్. , బెంగళూరు

కం.

నూతనముగ నేర్పెదవా
తాతకు దగ్గులు? గరపక తప్పదు బాలా
వ్రాతలు తాతయె వ్రాయ వి
ఘాతము లేకయె తెలుగున కంప్యూటరుపై

గండికోట విశ్వనాధం, హైదరాబాద్

కం.

అతి తెలివితొ గతి తప్పిన
నేతకు నీతులు, జనులకు నిరసన తెరగుల్,
మాతకు పిల్లల నడవడి
తాతకు దగ్గులు గరపక తప్పదు బాలా!

ఇంద్రగంటి సతీష్ కుమార్, చెన్నై

కం.

నూతన యంత్రములు మనిషి
చేతిపనులు కడు సులువుగ జేసెను! ఇకపై
తాతలు నూతనమగుటకు,
తాతకు దగ్గులు గరపక తప్పదు బాలా!

విద్యలేని వాడు వింతపశువు!

<u>పుల్లెల శ్యామసుందర్</u>

ఆ.వె.

వేడిగిన్నె చురక వాడిగా తగలగా,
వెర్రికేక పెట్టె గొర్రెలాగ,
పప్పు చేయబోవ, పలుచగా తేలగా,
ఓండ్ర పెట్టెనతడు నోర్వలేక,
పాకమువలెనున్న శాకముందినలేక,
రంకె వేసెనయ్య రంగచారి,
వంట చేసిపెట్ట యింట యిల్లాలు 'శ్రీ
విద్య' లేని వాడు, వింత పశువు!!!,

<u>జక్కంపూడి సుబ్బారాయుడు</u>

ఆ.వె.

విద్యయన వినయము, విజ్ఞానసంపద,
విద్య యొసగు నేడు విత్తమార్గ
నమున నేర్పు మిగుల, నరయగ నిటువంటి,
విద్య లేని వాడు వింత పశువు!

<u>తల్లాప్రగడ రావు</u>

ఆ.వె.

ఏమి చెప్పగలను ఏమి తెలియనోడ్కి
విద్యలేనివాడు వింత పశువు
అంటె ఆ విద్య ఎవరని యడుగునోడ్కి
నేను చెప్పనామె ఎవరొ నీకు!

కోతితో పెండ్లికుదిరెనని కోమలి మురిసెన్

ఓరుగంటి వేణుగోపాలకృష్ణ, న్యూ జర్సీ

కం.

నాతితొ సరసముగ సఖుడు
కోతిని నేనవ్వ లేత కొబ్బరి నీవొ
ప్రీతితొ పెండ్లాడమనిన
కోతితొ పెండ్లికుదిరెనని కోమలి మురిసెన్

డా. ఐ. యస్. ప్రసాద్, సికింద్రాబాద్

కం.

'మాతలు లావని' పలికెడు
నాతికి రాంకోటిబావ నచ్చెను బాగా.
నాతిగ తలచెను "నాలాం
కోతితొ పెండ్లికుదిరెనని" కోమలి మురిసెన్

తుమ్మల శిరీష్ కుమార్, హైదరాబాద్

కం.

కూతురు మెచ్చక యున్నను
జాతకుడని తలచి మనువు జరపగ నెంచెన్
ఆతనికీలోపున ఇం
కోతితొ పెండ్లికుదిరెనని కోమలి మురిసెన్

సూర్యుండుదయించె రాత్రి శుభములు కలుగన్

వారణాసి సూర్యకుమారి ,మచిలీపట్టణం

కం.

సూర్యం విహారయాత్రగ
భార్యామణితోడ చూడ భాగ్య మలాస్కా
సూర్యమొక వింత గనెనట
సూర్యుం డుదయించె రాత్రి శుభములు కలుగన్

గండికోట విశ్వనాధం, హైదరాబాద్ (తాత్కాలికంగా సిడ్నీ)

కం.

కార్యాలయమున రాత్రని
వార్యపు పనుల మునిగి తన వాసము చేరన్
భార్య సరసోక్తిగ గొణగె
సూర్యుండుదయించె రాత్రి శుభములు గలుగన్

శివప్రసాద్ చావలి,సిడ్నీ

కం.

సూర్య కిరణములు తగులగ
సూర్యఘటంబున నిలచిన సూర్యప్రభలే
సూర్యాస్తమయమున వెలుగ
సూర్యుండుదయించె రాత్రి, శుభములు గలుగన్
(సూర్యఘటము:సోలార్ సెల్)

తక్కువ డబ్బున్నవాడె ధనవంతుడిలస్

సూర్యకుమారి వారణాసి, మచిలీపట్టణం

కం.

మక్కువ కలిగిన వన్నియు

గ్రక్కున పొందుటకు కతము కలిమియె కాదా?

దక్కిన సంతృప్తి కగున

తక్కువ? డబ్బున్న వాడె ధనవంతుడిలన్

డా. రామినేని రంగారావు యం.బి.బి.యస్, పామూరు, ప్రకాశం జిల్లా.

కం.

లెక్కకు మించిన రొక్కము

మక్కువ"స్విస్"బ్యాంకులందు మరుగున నుండన్

లెక్కకు పన్నును కట్టగ

తక్కువ ధనమున్నవాడె ధనవంతుడిలన్

గండికోట విశ్వనాధం, హైదరాబాదు

కం.

మక్కువ తీరగ వనరులు

చక్కగ బొక్కుచు దొరవలె చతురత చెలగన్

నిక్కెడి ధనేశు కంటెన్

తక్కువ డబ్బున్నవాడె ధనవంతు డిలన్

ఒకటి నొకటి గూడి యొకటి యగును

సూర్యకుమారి వారణాసి, మచిలీపట్టణం

ఆ.వె.

కమల తనకు తెలివి కలదంచు చూపెను
ఒకటి క్రింద గీత నొకటి గీసి
కలిపి గీత చెప్ప గలిగె నొక్కటి చేసి
ఒకటి నొకటి గూడి యొకటి యగును

రాజేశ్వరి నేదునూరి, న్యూజెర్సీ

ఆ.వె.

ఇతర సంఖ్యలందు మితిమీరి పెరుగుచు
గుణితమందు హెచ్చు గొప్పగాను
ఒకటి నొకటి గూడి యొకటి యగునువింత
కలిపి జూచి నంత పలుకు రెండు

ఇంద్రగంటి సతీష్ కుమార్, చెన్నై

ఆ.వె.

తగ్గె మార్కులనుచు తల్లి దండ్రులడుగ,
తగిన రీతి జెప్పె తనయ గురువు!
పగటి కలలు గనుచు పాఠములు వినిన,
ఒకటి నొకటి గూడి యొకటి యగును!

రెండును రెండును గలియగ రెండే యగురా!

శివప్రసాద్ చావలి, సిడ్నీ

కం.

రెండు తనువులు కలియగ నొ

కండు; మరొక జత తనువులు కలియగ స్త్రీయున్

నిండుగ పుట్టియు జతగొన

రెండును రెండును గలుపగ రెండే యగురా!

మైలవరపు సాయికృష్ణ, సాక్రమెంటో, కాలిఫోర్నియా

కం.

బండికి రెండగు చక్రము

లుండిన జతయగు నొకటిగ రూఢిగ గనినన్

రెండుల నొక్కటి లెక్కన

రెండును రెండును గలియగ రెండే యగురా!

పుల్లెల శ్యామసుందర్, సేన్ హోసే, కాలిఫోర్నియా

కం.

రెండిచ్చితి రెండు తడవలు

రెండెట్లగునని యడుగగ రెడ్డిట్లనియెన్

"పొండిర, లంచములందున

రెండును రెండును గలియగ రెండేయగురా!"

క్రుళ్ళిన వంకాయ మేలు కూరకు నెపుడుస్!

వారణాసి సూర్యకుమారి, రాంచి

కళ్ళకు నచ్చిన కూరలు
మళ్ళీ కొని నిల్వ నుంచ మంచివె పాడై
మెల్లగ మిగిలిన వన్నీ
కుళ్ళిన, వంకాయ మేలు కూరకు నెపుడున్

గండికోట విశ్వనాధం, హైదరాబాద్

కల్లును త్రాగగ మిగిలిన
చిల్లరతో కూరలు కొని చేరగ కొంపన్
పెళ్ళాం తిట్లకు బదులిడె
క్రుళ్ళిన వంకాయ మేలు కూరకు నెపుడున్.

పుల్లెల శ్యామసుందర్, శాన్ హోసే, కాలిఫోర్నియా

పిల్లా, చౌకగ దొరికెడి
క్రుళ్ళిన వంకాయ గూడ కూరకుఁ దగునే!
క్రుళ్ళిన భాగముఁ గోయగ
క్రుళ్ళిన వంకాయ మేలు కూరకు నెపుడున్!

దేశభాష లందు తెలుగు లెస్స

<u>**కృష్ణ అక్కులు**</u>

ఆ.వె.

'సరిగమప'లలోన చక్కగా నొదుగునె

కూచిపూడి జతులకు జత యగునె

తెలుగు పదము, హాయి కలుగ జేయగ, కాదె

దేశభాష లందు తెలుగు లెస్స

<u>**ఇంద్రగంటి సతీష్ కుమార్, చెన్నై**</u>

ఆ.వె.

తెలుగు పలుకు నోట తేనెలొలుకు ఊట,

తెలుగు భాష గొప్ప తెలియ జెప్ప,

భరత భూమి నున్న భాషలె గాక వి

దేశ భాష లందు తెలుగు లెస్స!

<u>**గండికోట విశ్వనాధం, హైదరాబాదు**</u>

సీ.

ఏ భాషలో మాట లేదేశ వసతైన - మురిపించి తెలిగించు ముచ్చటలను

ఏ భాషలో పాట లింపార నొంపార - స్వరముల రసహేల సంతరించు

ఏ భాషలో యాస లెందేని వినిపించ - ఏ ప్రాంత వాసులో ఎరుక పరచు

ఏ భాషలో పద్య మేయింట పఠియించ - తెలుగింటి వారంచు తెలియ బరచు

ఆ.వె.

అట్టి సరస మధుర సాహిత్య సంగీత

ఆశు కవితల కలితావధాన లలిత

మాట పాటలందు మేటియై మెప్పించు

దేశ భాషలందు తెలుగు లెస్స.

రోహిణికార్తెలో చలికి లోకులు బాధలనొందురెప్పుడుస్

చావలి శివప్రసాద్, సిడ్నీ

ఉ.

ఆ హరివాహనుండు గతి యందును బైరిని దాటి ఉత్తరా

రోహణుడై ప్రచండమున రోళ్ళను బద్దలు చేయ జేర, నో

హోహో! హుహూ హుహూ హుహుహుహుహూయని వణ్కుచు యామ్య సీమలన్

రోహిణి కార్తెలో చలికి లోకులు బాధలనొందురెప్పుడున్

(హరివాహనుడు=సూర్యుడు; బైరి=మకరము; యామ్య సీమలు=

దక్షిణ దేశములు (ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మొ.))

జంధ్యాల కుసుమ కుమారి, హైదరాబాదు

ఉ.

దాహము దాహమంచు పరితాపము తాళగ లేనిదెన్నడో

దేహముకంపితంబగుచు తేజ విహీనత చెందుటెందుకో

సాహస దీపమేమఱచి సాగిన నేమి ఘటిల్లునో,లలిన్,

రోహిణి కార్తెలో, చలికి, లోకులు బాధల నొందురెప్పుడున్

(లలిన్=వరుసగా)

శ్యామసుందర్ పుల్లెల, శాన్‌హోసె, కాలిఫోర్నియా

ఉ.

ఐహిక సౌఖ్యముల్ కొఱకు నాపని ఇంధన వాడకమ్ము చే

ఊహలకందనంతగను యుర్విన కాలము తారుమారగున్

ఆహిమకూటముల్ గరుగు, ఆగవు ఎండలు కార్తికమ్మునన్

రోహిణి కార్తెలో చలికి లోకులు బాధలనొందురెప్పుడున్

(ఇంధనకాలుష్యం మూలంగా ఋతువులు

తారుమారవుతాయంటారు. ఆ దృష్టిలో పూరిమపబడింది)

బ్యాటింగును జేయువాడె బౌలరు గదరా!

శివప్రసాద్ చావలి, సిడ్నీ

కం.

ఆటన, చివరి వికెట్టుకు

ధాటిగ బవులరులిడు తుది దాడికి క్లైమాక్స్

వేటుల గెలుపు పథంబున

బ్యాటింగును జేయువాడె బౌలరు గదరా!

జంధ్యాల కుసుమ కుమారి, హైదరాబాదు

కం.

పాటించుచు నియమావళి

ఆటంతయునభ్యసించి ఆల్ రౌండరగున్

వాటంబించుక చెదరక

బ్యాటింగును జేయు,వాడె బౌలరు గదరా!

ప్రసాద్ ఇంకొల్లు

కం.

బ్యాటింగులు బెట్టింగులు

ఏ 'టింగు'లు తెలియనోడు బేలగ పలికెన్

బ్యాటింగెవరని అడుగగ

"బ్యాటింగును జేయువాడు బౌలరు గదరా!"

రావణుని బంటువైతివి రామచంద్ర

డా: ఐ.యస్. ప్రసాద్, హైదరాబాద్

తే.గీ.

తోకతో జుట్టి నీ యున్న తోచితాస

నాన బాగుగా గూరుచోన, చిన బుచ్చ

రావణుని, బంటువైతివి రామచంద్ర

మూర్తికాంజనేయా, నీవె స్ఫూర్తిదాత!

పుల్లెల శ్యామసుందర్, శాన్ హోసే, కాలిఫోర్నియా

తే.గీ.

షోకు కోసము సిగరెట్టు పీకలూది

ఆపుకోలేక ఇప్పుడీ యాతనేల

లోకులను చంపు సిగరెట్టనే కలియుగ

రావణుని బంటువయితివి రామచంద్ర!

తల్లాప్రగడ, శాన్ హోసే, కాలిఫోర్నియా

తే.గీ.

రావణాసురుడైన పరవశమొంది

నిన్ను పూజించి నట్లైన అన్ని మరచి

భక్త దాసుడవైతె, నీ భక్తులనర,

రావణుని బంటు వయితివి రామచంద్ర!!

పలువురి తండ్రుల తనయుడు భక్తిన మ్రొక్కెన్!

వేదుల బాలకృష్ణమూర్తి, శ్రీకాకుళం

కం.

ఇల కన్న తండ్రియు, ధన

విలసితుండగు పోషకుండు, విద్యను నేర్పే

కులపతి తండ్రులె అనుచును

పలువురు తండ్రుల తనయుడు భక్తిన మ్రొక్కెన్

తల్లాప్రగడ రావు, శాన్ హోసే, కాలిఫోర్నియా

కం.

తలచుతు దేవునె తండ్రని

కొలిచెను దేవుల సకలము, కూరిమి తోడన్!

వెలసిన భక్తుడె అతడై,

పలువురి తండ్రుల తనయుడు భక్తితొ మ్రొక్కెన్!

యం.వి.సి.రావు, బెంగుళూరు

కం.

గెలువంగ పద్మవ్యూహము

పిలిపించగ దారినెరుగు పిన్నవయస్కున్

విలపించు మాత్రుమూర్తికి

పలువుర తండ్రుల తనయుడు భక్తితొ మ్రొక్కెన్.

ఉండె కన్యాకుమారియె ఉత్తరమున

తటవర్తి కళ్యాణ్

తే.గీ.

బుడుతడొకడు పరీక్షన బుద్ధి నిలిపి
ప్రక్కవాని పటము జూసి వ్రాయపూనె
తికమకపడి దేశ పటము ద్రిప్పి వ్రాయ
నుండె కన్యాకుమారియే ఉత్తరమున

పుల్లెల శ్యామసుందర్, శాన్ హోసే

తే.గీ.

బుద్ధగయఁ జూడ శ్రీలంక బౌద్ధుఁడొకడు
భరత దేశముఁ జేరగ బయలుదేరి
నౌకలో పయనింపఁ యా నావికునకు
ఉండె కన్యాకుమారియె ఉత్తరమున

గండికోట విశ్వనాధం, హైదరాబాద్

తే.గీ.

దయను వర్షించు దేవిగా దక్షిణమున
ఉండె కన్యాకుమారియె, ఉత్తరమున
శక్తి పీఠంబు నందుండు శారదాంబ
అష్ట దిశలందు వెలుగొందు ఆది శక్తి

అర్జునుడొక పిడుగుపడగ నమ్మో యనెనే

గోలి హనుమచ్ఛాస్త్రి, గుంటూరు

కం.

దుర్జన కౌరవ సేనకు
అర్జునుడొక పిడుగు, పడగ నమ్మో యనెనే
ఆర్జించిన పాశుపతము
ధూర్జటినే తలచి వేయ ధూర్తుల పైనన్.

యం.వి.సి. రావు, బెంగళూరు

కం.

ఆర్జిత పుణ్యుడు భీష్ముడు
గర్జించుచునశని శరల కదనము సేయ
న్నూర్జిత బలుడై యుండియు
అర్జునుడొక పిడుగు పడగ అమ్మోయనియన్
(గర్జించుచునశని= [గర్జించుచున్ + అశని])

పుల్లెల శ్యామసుందర్, శేన్ హోసే, కాలిఫోర్నియా

కం.

ఆర్జీ పెట్టెద స్వామీ!
దర్జాగా ఇట్టులనుట తగునా మీకున్?
వర్జితమదిగద, ఎప్పుడు
అర్జునుడొక పిడుగు పడగ అమ్మో అనెనే?

అస్పృశ్యత చక్కనైన అలవాటు కదా

డా. రామినేని రంగారావు యం.బి.బి.యస్,పామూరు,ప్రకాశం జిల్లా,

కం.

అస్పృస్యత పరమహిళల
అస్పృస్యత యాజకునకు యజ్ఞము వేళన్
అస్పృస్యత మకిలంటిన
అస్పృస్యత చక్కనైన అలవాటు కదా

యం.వి.సి.రావు, బెంగళూరు

కం.

అస్పృశ్యులెవరు జగతిని
నిస్పృహకులచిచ్చురేపు నీచులు కారే
ఆ స్ప్రష్ట విడని జనులెడ
అస్పృశ్యత చక్కనైన అలవాటు కదా!

వారణాసి సూర్యకుమారి, మచిలీ పట్నం

కం.

నిస్పృహ నిరాశను సమా
జ స్పృహ కోల్పోవ దుర్దశకు పాలుస్తే
సి స్పృహను జంపు మద్యము
అస్పృస్యత చక్క నైన అలవాటు కదా

నిషిద్ధాక్షరి : 'ర' మరియు 'మ' అక్షరములు (వాని గుణింతములు) వాడకుండా శ్రీ రాముని స్తుతిస్తూ పద్యము వ్రాయవలెను.

కంది శంకరయ్య, హైదరాబాదు

కం.

ఇనకుల దుగ్ధాంబుధి శశి!

ఘనశివకోదండ భంగ! కాశ్యపిజ పతీ!

దనుజాంతక! సజ్జన హృ

ద్వనజాదిత్యా! నుతింతు, దయఁ గనుఁగొనవే!

సమవర్తి, హైదరాబాదు

చ.

జనకుని వాక్కు నిల్పగ నిజాంగనయున్ సహజుండు తోడుగా

ఘనవనవాసివై దనుజకాండకృతాంతుడవై తపస్వివై

వనధిని సీతకై గడచి బాలిశు దానవు జంపి లోకముల్

నినువినుతింప గాచితి దినేశ కులాగ్రణి! నిన్ను గొల్చెదన్!!

డా|| అయాచితం నటేశ్వర శర్మ, కామారెడ్డి, నిజామాబాదు జిల్లా

ఉ.

జానకి పెండ్లియాడితివి చక్కని వైన గుణాలు నిండగా

పూనికతోడ సత్యమునుబూని వనమ్ములనైననిచ్చతో

పోనడువంగ నెంచితివి పూజ్యము నీ కథ భూమికెప్పుడున్

నా నతులెత్తు నీకు నను నవ్యపథమ్ముల సాగజేయవే!

కందకు లేనట్టి దురద కత్తికిఁ బట్టెన్

డా.రామినేని రంగారావు, యం.బి.బి.యస్, పామూరు, ప్రకాశంజిల్లా.

కం.

ఎందుకు ఆంధ్రుల విభజన

పొందుగ శాసనసభలన పొసగదు అన్నన్

ముందుకు దూకెను కేంద్రము

కందకు లేనట్టి దురద కత్తికిఁబట్టెన్

జంధ్యాల కుసుమ కుమారి

కం.

కుందె మనంబున యా భృగు

నందనుడు బలి వర దాన నియమోద్ధతికిన్

తొందరగ యడ్డు కొనెనొకొ

కందకు లేనట్టి దురద కత్తికి కల్గెన్

రావు తల్లాప్రగడ, శాన్ హోసే, కాలిఫోర్నియా

కం.

చెందని భద్రాద్రిమ్మని

చందర శేఖరుడొకండు చతురత చూపెన్,

ముందది అంధ్రుల దైనను!

కందకు లేనట్టి దురద కత్తికిఁ బట్టెన్!

క్రోధంబే సుగుణమగును కోమలి కెపుడుస్

నేదునూరి రాజేశ్వరి, న్యూజెర్సీ

కం.

బాధించు పగను పురుషుని
క్రోధంబే, సుగుణ మగును కోమలి కెపుడున్
బేధము లెంచక మృదువుగ
సాధించక చెలువు మీర సంతస మొందున్

భాస్కర కొంపెల్ల

కం.

సాధనతో సద్విద్యల
సాధింపగ బద్ధకించు సంతానముపై
బాధపడనేమి? కించిత్
క్రోధంబే సుగుణమగును కోమలికెపుడున్.

మాజేటి సుమలత, క్యూపర్టీనో, కాలిఫోర్నియా

కం.

భేధంబెంచక పట్టెగ
దా దండారము నరకుని హతమొనరింపన్
చేధించ దుష్ట శక్తుల
క్రోధంబే సుగుణమగును కోమలికెపుడున్

గెల్వఁగఁ నేడ్చెనొక్కడును గెల్వక నోడినవాడు నవ్వగన్

పోచిరాజు కామేశ్వర రావు, రాయపూర్, ఛత్తీస్ఘడ్, ఇండియా.

ఉ.

వల్వల యందమారసి యపారపుఁ బ్రేమ జనించ తూర్ణముం
గల్వలఁ బోలు కన్నులని కన్యను గోరఁగ నిద్దఱొక్కతెం
జెల్వము లేని మోముఁ గని చెంద నిరాశ నెడంద నంతటన్
గెల్వఁగ నేడ్చె నొక్కఁడును గెల్వక యోడిన వాఁడు నవ్వఁగన్

ఎం.వి.యస్.రంగనాథం, హైదరాబాద్

ఉ.

సుల్వుగ తన్ను గెల్చు గతిఁ జూపగ ప్రేమన తాత, తా మదిన్
నిల్వక పొంగు దుఃఖమును నెగ్గుచు క్రీడి శిఖండి మాటునన్
తెల్విగ నిల్చి బాణముల దేహముఁ గప్పుచు భీష్ముఁ గూల్చినన్
గెల్వఁగఁ నేడ్చెనొక్కడును గెల్వక నోడినవాడు నవ్వగన్

పుల్లెల శ్యామసుందర రావు, శాన్ హోసే, కాలిఫోర్నియా

ఉ.

నిల్వడి యెన్నికందు తను నెగ్గుటయే యొక ధ్యేయమవ్వగన్
పల్వురఁ జేర్చి యార్భటిన బాగుగ ద్రవ్యము ధారబోయుచున్
కొల్వును పొందనేమి మరి కూర్చిన సంపద పోయెనంచు తాఁ
గెల్వగఁ నేడ్చెనొక్కడును గెల్వక నోడినవాడు నవ్వగన్

వంకాయన చెఱుకురసము వడివడి యుబికెన్

Dr.రామినేని రంగారావు, పామూరు

కం.

అంకమ్మ జాతరందున

ఊంకించిన మాయలోడు ఉత్సాహముతో

వంకర దండము మీటగ

వంకాయన చెఱుకు రసము వడివడి యుబికెన్

నేదునూరి రాజేశ్వరి, న్యూజెర్సీ

కం.

ఇంకేమి వింతలుం డునో

సంకర జాతులుగ పుట్టు సంబర మందున్

వంకర టింకర యుగమిది

వంకాయన చెఱకు రసము వడివడిఁ యుబికెన్

చావలి విజయ

కం.

ఎంకియు వండెను బావకి

వంకాయ మసాల ఘుమఘుమ వాసన లెగయన్

ఎంకిని చూడగా రుచికర

వంకాయన చెరకు రసము వడివడి యుబికెన్

పందినిఁ కౌగిలించుకొని పంకజలోచన సంతసించెరో

శివప్రసాద్ చావలి, సిడ్నీ

ఉ.

కొందము బొమ్మలన్ తనయకున్ మురిపమ్ముగనంచు యంగడిన్
విందుగ కళ్ళకున్ తనకు వీలుగ జూపగ తల్లిదండ్రులున్
ముందుగ మెచ్చి చందముగ మెత్తని సీమల దూదిబొమ్మయౌ
పందిని కౌగిలించుకుని పంకజ లోచన సంతసించెరో

పుల్లెల శ్యామసుందర్, శేస్ హోసే, కాలిఫోర్నియా

ఉ.

కొందరు హాస్యమాడ కడుకూరిమి తోడుతఁ బిల్తురాతనిన్
పందని, కారణంబడుగ 'పంట దివాకరు' నామధేయమే
సుందరి పెండ్లిచేసుకుని శోభనమందున ప్రేమమీర యా
'పంది'ని కౌగలించుకొని పంకజలోచన సంతసించెరో!

అన్నాప్రగడ పంతుల జగన్నాథ రావు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్

ఉ.

ఇందిర వల్లభుండు హరి యుద్ధర గావ వరాహ మూర్తియై
సందిట పైడి నేత్రు గొని చంపగ జూచిన రత్నగర్భ తా
పొందిన నోము పంటయని పొంగుచు మేనిని పుల్క లెత్తగా
పందిని కౌగలించుకొని పంకజ లోచన సంతసించెరో

నిషిద్ధాక్షరి: క, చ, ట, త, ప లు లేకుండా వేసవి సెలవలను వర్ణిస్తూ ఛందోబద్ధముగా పద్యము వ్రాయవలెను

సూర్యకుమారి వారణాసి, మచిలీపట్నం

సీ|| అవిరామముగనుండు   ఆలుమగలు బిడ్డ - లుమురియును సెలవులూహ మెరియ

ఉదయాద్రి సూర్యుని ఉదయమ్ము మొదలుగ - మెండునిర్ణయములు మెదలు మదిని

ఎండవేడిమి లేని ఏవూర నైనను - వారమున్నను మేలు వర మె యగును

హిమమండలంబైన యిహమును మరిపించు - మానసోల్లాస ధామంబె యనగ

ఆ.వె|| వేసవి సెలవులను వీర విహారముల్

ఊహగానె మిగుల నుష్ణమునను

సాహసముగ జనిన సాధ్యమే యనిమేము

బయలుదేరినాము భాగ్యవశము

డా. రామినేని రంగారావు, పామూరు, ప్రకాశం జిల్లా

తే.గీ.

సమవయస్సున్న సఖులము సందడిగను

వేసవందున ఇష్టమౌ విడుదు లరసి

అడవిలోనున్నసెలయేళ్ యందుమునిగి

విరులు వెదజల్లు సుమరాగ విభవ మలర

మనసు ఉల్లాస మందగా మసలినాము

చావలి విజయ, సిడ్నీ

తే.గీ.

వేసవి సెలవులన్నను వేడి యుండు

బడులు లేని విద్యార్థులు బాగు సర్ది

మురిసి అమ్మమ్మగారిల్లు మూల సందు

గొందులందాడెదరు గోళి గోల గేము.

తప్పులుఁ జేసెడి మనుజుడె ధన్యుండిలలో

టేకుమళ్ళ వెంకటప్పయ్య, విజయవాడ

కం.

ఎప్పుడు దోషము లెన్నుచు

తప్పుడు పనులే దలచుచు, తామే ధరణిన్

గొప్పని నుడివెడు జనులకు

తప్పులుఁజేసెడిమనుజుడెధన్యుండిలలో

శ్యామసుందర్ పుల్లెల

(ఈ పద్యమునకు ప్రేరణ శ్రీ రాజ తల్లాప్రగడ, సిడ్నీ గారు పంపిన కవిత)

కం.

తప్పగునేమో మనకిక

ఘుప్పని పొగ త్రాగకున్న గురువు గిరీశం

చెప్పెను గద "పొగ త్రాగెడి

తప్పులుఁ జేసెడి మనుజుడె ధన్యుండిలలో!"

శివప్రసాద్ చావలి, సిడ్నీ

కం.

చెప్పెను రణమున ధర్మం

బొప్పగ సత్యము నసత్యముగ ధర్మజుడున్!

తప్పనిసరి వేళల తగు

తప్పులు జేసెడి మనుజుడె ధన్యుండిలలో!

జలమును పారబోయుటయె చక్కని కార్యము వేసవందునన్!

వాగమూడి లక్ష్మి రాఘవరావు, కరీంనగర్

చ.

కొలనులయందు, కాలువల కూటమియందు, తటాకమందునన్
సలిలము లేకమానవులశక్తులమంచును చేతులెత్తగన్
యిలజధారఁ బెంచుటకు నింకుడుగుంటలుఁ ద్రవ్వ వానిలోఁ
జలమును పారవోయుటయె చక్కని కార్యము వేసవందునన్

జంధ్యాల కుసుమ కుమారి, హైదరాబాదు

చ.

పలుచన సేయ నేమి కలుపంగ దగున్ శుచియైన పాలకున్
తలపగ వర్షసిక్తమగు ధాన్యమునేమి యొనర్పగావలెన్
జలమిడుటెట్టి కర్జము,నిజార్క విజృంభణమెన్న డోజుగన్
జలమును, పారవోయుటయె ,చక్కని కార్యము, వేసవందునన్.
(ఓజు=వరుస)

ఇంద్రగంటి సతీష్ కుమార్, చెన్నై

చ.

మలమల మాడుటెండలకు మానవ చేతలె కారణంబగున్;
వెలవెలబోయె చెట్లు కడు వేసవి తాపము వల్ల మానవా;
పలుకులు మాని మొక్కలకు పాదులు గట్టుము, అందు వ్యర్ధమౌ
జలమును పారబోయుటయె చక్కని కార్యము వేసవందునన్!

తాతా యని ప్రేమతోడ తరుణినిఁ బిలిచెన్

శ్రీమతి జి సందిత బెంగుళూరు

కం.

ప్రీతిన్ పెళ్ళాడన్ కవి

నా తాళంవారి తార నటులఁజిలిపిగా

నాతండు ముద్దుపేరున

తాతా యని ప్రేమతోడ తరుణినిఁ బిలిచెన్

పోచిరాజు కామేశ్వర రావు, రాయిపూర్

కం.

ఆతత రోషా కలితా

తీత విచా రాగ్ని తప్త దేహి వెడల,నీ

వ్రాతల దెలియంగ వశమె

తాతా! యని, ప్రేమతోడ తరుణినిఁ బిలిచెన్

[తాత = బ్రహ్మ]

పుల్లెల శ్యామసుందర్, శేన్ హోసే, కాలిఫోర్నియా

కం.

కూతురి గృహముకు వెడలిన

మాతామహి బయలుదేర, మనుమడు ప్రీతిన్

నాతికి "టాటా" బదులుగ

"తాతా" యని, ప్రేమతోడ తరుణిని బిలిచెన్

చిట్టెలుకకు బెదిరి పిల్లి ఛెంగున దాగెస్

ఇంద్రగంటి సతీష్ కుమార్, చెన్నై

కం.

పొట్టలు చెక్కలు కార్టూన్
పెట్టిన, కడు తెలివి జెర్రి పెట్టెడి పాట్లన్
తట్టుకొన లేదు, చూడగ
చిట్టెలుకను జూచి పిల్లి చెంగున పారెన్!

వారణాశి .సూర్యకుమారి, మచిలీపట్నం

కం.

కొట్టుటె యాటగ బుడతడు
గట్టిగ కొట్టగ ను బామ్మ కంటికి తగులన్
గుట్టుగ దాగుచు నిట్లనె
చిట్టెలుకకు బెదిరి పిల్లి చెంగున దాగెన్

చావలి విజయ

కం.

గుట్టుగ నేత పలుకులను
యిట్టే టి.వి లో నిశితపు వివరణ చూపన్
వట్టిదని చెప్పు రీతిది
చిట్టెలుకకు బెదరి పిల్లి చెంగున దాగెన్.

అంబాయని శునకమరిచె నందరు మెచ్చన్

దువ్వూరి వి యస్ సుబ్బారావు, కొంతమూరు, రాజమహేంద్రవరం.

కం.

ముంబైలో లభియించెను

నంబూద్రికి పెంపు కుక్క 'నన్నీ', యేగన్

చెంబైకి పెళ్ళి కతడు త

నం బాయని శునక మరిచె నందరు మెచ్చన్.

పుల్లెల శ్యామసుందర్, శాన్ హోసే, కాలిఫోర్నియా

కం.

బెంబేలెత్తిన ఆవనె

నంబా యని; శునక మరిచె నందరు మెచ్చన్

సంబరముగ భౌభౌ యని

అంబిక యను పాపచూచి హహయని నవ్వన్

సూర్యకుమారి వారణాశి, నార్త్ కరోలినా

కం.

అంబర మంటగ భక్తులు

సంబరముగ పరమశివుని శంభో యని యా

డంబరముగ బిల్వంగను

అంబా యని శునకమరచె నందరు మెచ్చన్

‘అక్కఱకు రాని చుట్టము’ పద్యాన్ని చంపకమాల ఛందస్సులో తిరిగి వ్రాయాలి.

వారణాసి సూర్యకుమారి, మచిలీపట్నం

చ.

అవసర కాల మందున సహాయము జేయని బంధువైననూ
సవినయ విన్నపమ్ము వినజాలని వేల్పును యుద్ధ రంగమున్
వ్యవధిగ నిల్పి సాగని హయంబును వెంట నె వీడ వచ్చునీ
సవివరణంబు చూసినను చాలును చేసిన మేలు సన్మతీ

గండికోట విశ్వనాధం, హైదరాబాద్

చ.

అదనున సాయమేమియు నొనర్పగ జాలని యట్టి చుట్టమున్
ముదమున భక్తితోడ మది మొక్క వరంబిడ లేని వేల్పునిన్
కుదురుగ నెక్కినన్ కదలకుండగ మొండిగ నుండు గుర్రమున్
వదలగ నొప్పు శీఘ్ర గతి వాదములేల? సుధీర ధీనిధీ !

పుల్లెల శ్యామసుందర్, శాన్ హోసే, కాలిఫోర్నియా

చ.

అడిగిన వెంటనే దయన నాదుకొనంగరాని బంధువున్,
యిడుములలోన మ్రొక్కినను యేమివరంబులు నీని దైవమున్
వడివడిబోవ యెక్కినను బాయని గుర్రము గొప్పదైననూ
విడువగ నుత్తమంబగుఁ వివేకముతో మనమెంచి జూచినన్

చుట్టములను కలసినంత సుఖములు తగ్గున్

ఎం.వి.యస్. రంగనాథం, హైదరాబాదు

కం.

గిట్టని మనుషులు చెప్పిరి,
'చుట్టములను కలసినంత సుఖములు తగ్గున్'
ఒట్టి యబద్ధము లట్టివి,
అట్టుల సూత్రీకరింప యన్యాయంబౌ.

ఇట్టపేని రాకేష్, సిద్ధిపేట.

కం.

అట్టిటు లున్నవి కూరలు
అట్టే రొట్టెల రస పస అరయగ లేదం
చెట్టేనియు వంక పెట్టు
చుట్టాలను గలిసినంత సుఖములు తగ్గున్.

గాదిరాజు మధుసూదనరాజు, అనంతపురము

కం.

చట్టము మెచ్చని పని చే
పట్టుచు లాభములబొంది బంధుత్వము చూ
పెట్టి విసిగించు చుండెడి
చుట్టములను కలసినంత సుఖములు తగ్గున్

దత్తపది: "దోని" (ధోని), "కోలి" (కోహ్లి), "రానే", "రైనా" పదాలను నామవాచకములు కాకుండా వాడుతూ క్రికెట్టు ఆటపై మీకు నచ్చిన చంధస్సులో పద్యము వ్రాయాలి.

గండికోట విశ్వనాధం, హైదరాబాద్

ఉ|| కేరింతల్ చెలగన్; అదో నినద సత్కేళీ క్రికెట్ హేల, నొం
పారం గాంచుటకో, లిఖింప చరితల్, పట్టుల్ వికెట్టుల్ పడన్
పేరుం బొందిన ఆటగాళ్ళు పరుగుల్ పెంపొందరా నేర్పుతో
ప్రారంభించి తెగించి మించుతరి తీరైనాడు క్రీడా ద్యుతిన్.

చావలి విజయ, సిడ్నీ

తే.గీ|| పరుగుకో లిప్త తత్తర పడిన తీరు
బౌండరీ తోసెరా నేర్పు పరుగు పెంచ
గెలుచు వారెవరైనా వికెట్టు పడిన
దోనిశితము చూపు కెమెరా తోడ విందు

జంధ్యాల కుసుమ కుమారి, హైదరాబాదు

సీ|| ఇరు పక్షములలోన నిరువుగా యువకులు - పదకొండుగురుయుండు బంతియాట
ఒక బృందమందొక డొడుపుగా విసిరినా - బంతి రానే వచ్చు పరిధి మీరి
జయమునకో లిప్త చాలునక్కజముగ - నవకాశపు మెరుపులరుదు గాన
కుదురునో లేదో నికరముగ పరుగులె - క్కువచేయబూనుటకాట గాండ్ర
తే.గీ|| కనుచు నభిమానులెల్లరు కాంచు యాట
జట్టునందొకరైనా విజయ శిఖరము
నందు బాట లో పయనింతురతి రయమున
ఘనముగ గణుతికెక్కిన క్రికెటు నందు.

రాముని వధియించి సీత రావణు జేరెన్

గండికోట విశ్వనాధం, హైదరాబాద్

కం.

సౌమిత్రెవరి యనుజుడు ?, హ

నుమ దనుజుల నేమి చేసె?, దూతగ గనెనే

రమణిన్, యెవరిని చేరెన్?

రాముని, వధియించి, సీత, రావణు చేరెన్.

పిల్లలమఱ్ఱి కృష్ణ కుమారు

కం.

దేముని మాటను కాదని

సోమము గాఢముగ తాగి నొదవిన్నావా?

కాముక తలపా? యెప్పుడు

రాముని వధియించి సీత రావణు జేరెన్?

పుల్లెల శ్యామసుందర్, శాన్ హోసె, కాలిఫోర్నియా

కం.

వామపు ముగింపు నిమ్మన

రామాయణమునకు, మార్చి వ్రాసెనొకండున్:

"తా మారెను లంకేశుడు

రాముని వధియించి సీత రావణు జేరెన్!

("Literature Studies" తరగతులలో, ప్రసిద్ధమైన పుస్తకాలకు వేరొక ముగింపునిస్తే ఎలాగ ఉంటుందని ప్రశ్నించడము అపుడప్పుడు జరుగుతుంది. ఆ త్రోవలో ఈ పూరణ)

ప్రతిపాదములోని మొదటి అక్షరములు కలిపిన

'దసరాలు' గా వచ్చేటటుల దసరా సంబరాలు వర్ణన

వారణాసి సూర్యకుమారి, రాంచి

సీ|| దరహాస వదనులై తరుణులు దసరాకు - బొమ్మల కొలువుంచు నుమ్మరముగ

సరదాగ పులివేష సందడిన్ తిలకించి- పులకించు పెద్దలూ పిల్ల లంత

రామాయణాది పు రాణముల్ హరికథా - శ్రవణాలు నవరాత్రి సంబరాలు

లుప్తమౌ విశ్రాంతి లోటు తీ రెడు రీ తి -వేడుకలగు నన్ని వేళలందు

తే.గీ|| ఉల్ల ముల్ రంజిలంగను పల్లె ప్రజలు

కొత్త బట్టలు ధరి యించి కోర్కె తీ ర

పండుగ దసరా సరదాలు నిండు గాను

జరుపు కొందురు ఉత్సాహ భరితు లగుచు

చావలి విజయ, సిడ్నీ, ఆస్ట్రేలియా

తే.గీ || దరువు జోడుగ పులి వేష ధారి చిందు

సంబరాల కోలాటల సందడి నవ

రాత్రి బొమ్మలకొలువుల్ల రంగు చీర

లు మెరియు వనిత దసరా రోజులందు.

ఇంద్రగంటి సతీష్ కుమార్, చెన్నై

కం|| దగదగ దుర్గమ్మ మెరుపు,

సగుడ మొరమొరాల్పులు వరుసల ప్రతిమలహో

రాగ సరిగమల కీర్తన

లు గలగలసిన నవ రాత్రులు ముదంబిచ్చున్!

తప్పు చేయకున్న తప్పుయగును

నిరంజన్ అవధూత, బోస్టన్

ఆ. వె.

పలికె ధర్మజుండు భారతమున బొంకు
దాగి వాలి గూల్చె దాశరథియు
ధర్మ రక్షణమున, తప్పని సమయాన,
తప్పు చేయకున్న తప్పు యగును.

డా.రామినేని రంగారావు, యం.బి.బి.యస్, పామూరు, ప్రకాశం జిల్లా.

ఆ.వె.

మంచి చేసినట్లె మదినైన పరులకు
తప్పు చేయ కున్న;తప్పు యగును
పరుల యశము గాంచి మదిలోన చింతించి
మలిన మనసు తోడ మాటలాడ

టేకుమళ్ళ వేంకటప్పయ్య

ఆ.వె.

కల్తి సరుకు నమ్మ కలియుగ ధర్మాన,
మంచి సరుకు నమ్మ మాడు పగులు
లోక రీతి మార్చ లోకేశు దిగిరాడ!
తప్పు చేయకున్న తప్పు యగును!

పతిని దూషించనట్టియా పత్ని తగదు

డా.రామినేని రంగారావు, యం.బి.బి.యస్, పాములూరు, ప్రకాశం జిల్లా.

తే.గీ.

వెలది-జూదంబు-పానంబువేడ్క మునిగి
తల్లిదండ్రుల-యిల్లాలిధనము కొరకు
రాచి-రంపానబెట్టెడు రక్కసుడగు
పతిని దూషించనట్టియా పత్ని తగదు

జగన్నాథ రావ్ కె. ఎల్. , బెంగళూరు

తే.గీ.

పీట వేయదు కంచము పెట్టబోదు
కొసరి వడ్డించ జాలదు కోమలాంగి
నోరు తెరచి యడిగినచో పోరు పెట్టి
పతిని దూషించ, నట్టియా పత్ని తగదు

వేదుల బాలకృష్ణ, శ్రీకాకుళం

తే.గీ.

తప్పు మార్గాన జనుచున్న తనదు భర్త
వర్తనము చక్కదిద్ద సుభాషితములు
పలికి చివరకు అవసరంబైన వేళ
పతిని దూషించ నట్టియా పత్ని తగదు

దత్తపది: వంగ, దోస, కాకర, కంద పదములను అన్యార్ధములతో వాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సమరానికి సంభందించిన విషయముపై స్వేచ్ఛా ఛందస్సులో పద్యము వ్రాయాలి

పోచిరాజు కామేశ్వర రావు, రాయిపూర్

కం|| దోసపుఁ బరిపాలనఁ గన

వేసరి కావంగ జనుల వేగము దేశా

వాసుల కాకర మొదవఁగఁ

జేసిరి మన కంద ఫలము స్థిరమతిఁ గృషియే

[దేశ+ఆవాసులకు+ఆకరము+ఒదవఁగ; ఆకరము = కోపము]

సహస్రకవిరత్న సహస్రకవిభూషణ శ్రీమతి జి సందిత బెంగుళూరు

సీ|| కురువంగ తూటాలు మరతుపాకులనుండి, ఝుళిపించె మనకత్తి ఝాన్సిలక్ష్మి

దోసపుశాసనాల్ దూసేటి సభ పైన, బాంబులగురిపించె భగదజాదు

లెక్కకందక తా నిలిపె పెను సైన్యాన్ని, జడవన్ పరుల్ సుభాష్చంద్రబోసు

కాక రగిల్చి నిగ్రహముల ద్రుల్చుచు, ధైర్యబలంబుల తరుగ జేసి

ఆ.వె|| తల్లడిల్లజేసె తెల్లదొరలనట్లు

భరతపౌరుషాలు పట్టు బట్టి !!

సమరమట్లు జరిగె స్వాతంత్ర్య సిద్ధికై

చరితయందు నిలిచె శాశ్వతముగ!!

విజయాదిత్య, విజయనగరం

తే.గీ|| పరపరిష్వంగదుఃఖిత భరతభూమి

పిలిచి నట్లెదో సడి వినిపించగా 'ప

దండి దండి' కని మయికందళములెత్త

శాంతి సైనికాకరములు శరధులయ్యె

వే-లం-టై-ను అనే నాలుగు అక్షరములు వరుసగా ఒకొక్క పాదారంభలో యుండునట్లు మీకు నచ్చిన ఛందస్సులో ప్రేమపై పద్యము వ్రాయాలి

దువ్వూరి వి యస్ సుబ్బారావు, కొంతమూరు, రాజమహేంద్రవరం.

కం.

వేంచేయుము నా స్వీట్ హార్ట్
లంచుని చేద్దాము హొటలు లాసన్స్ బేలో
టైం చాల దనకు డాళింగ్
నుంచొని ఉంటాను ప్రామిస్ నో చెప్పకుమా.

వెన్నె ల సత్యం, షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

తే.గీ.

వేయి జన్మల కైనను వీడనట్టి
లంకె కుదిరాక నీకేల శంక; ముచ్చ
టైన జంటగా మనమొక్క టైన మేలు
నువ్వు సమ్మతించగ చిన్ని నవ్వు చాలు!!

సూర్యకుమారి వారణాశి, నార్త్ కరోలినా

తే.గీ.

వేయి కనులు కాయ వేచి చూచుచు నుంటి
లంక నున్న సీత లాగ నేను
టైము దాటె వచ్చుట మరచిపోతివా
నువ్వు లేక నేను నుండ బోను.

SAMPADA
SiliconAndhra
Music, Performing Arts
and Dance Academy

in Affiliation with
Potti Sreeramulu Telugu University
(NAAC Accredited University in India)

Junior Certificate / Senior Certificate

Carnatic Music
(Vocal, Veena, Violin, Flute & Mridangam)

Hindustani Music
(Vocal, Sitar, Violin & Tabla)

Indian Classical Dance
(Kuchipudi, Andhra Natyam & Bharatanatyam)

Hurry Up!
Register Today
Admissions Open

Enroll into SAMPADA to get academic credentials for your artistic talent & passion

Features

- Learn from your own Guru
- Earn academic credits (16 Jr. Cert. + 16 Sr. Cert.)
- Structured program
- Evergrowing online resources for students and gurus
- Insights from stalwarts
- Opportunity to learn the theoretical aspects of the art form
- Using state of the art LMS (Canvas Learning Management System)
- Learning has no age limit

For complete details :

Web: sampada.siliconandhra.org
Call: 1 866 5SAMPADA (572 6723)
Email: support@sampada.siliconandhra.org